# గరీబీ హటావో నినాదాన్నిచ్చినవారు?

## స్వతంత్ర భారతదేశం

- స్వతంత్ర భారతావని మొదటి ముప్పై సంవత్సరాల్లో (1947-77) అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. తొలి సార్వత్రిక ఎన్నికల్లో (1952) దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు పునాది పడింది. ఒక వ్యక్తి- ఒక ఓటు, ఒక ఓటు-ఒకే విలువ అనే రాజ్యాంగ సూత్రాలు అమలై రాజకీయ సమానత్వం సాధ్యమైంది. మొదటి మూడు సార్వత్రిక ఎన్నికల్లో (1952, 1957, 1962) కనిపించిన ఏక పార్టీ (కాంగ్రెస్) ఆధిపత్యం 1967 ఎన్నికల్లో క్షీణించి బహుళ పార్టీ వ్యవస్థకు, ప్రాంతీయ పార్టీల ప్రాబల్యానికి దారి తీసింది. 1948, 1965, 1971ల్లో పాకిస్థాన్, 1962లో చైనాలతో జరిగిన యుద్ధాల వల్ల భారతదేశం తన విదేశాంగ విధాన లక్ష్యాలను పునఃపరిశీలించుకోవాల్సి వచ్చింది. 1975లో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలోని సంఘటనల గుణపాఠాలు రాజకీయ ప్రజాస్వామ్య ప్రక్షాళనకు దోహదపడ్డాయి. ఈ భిన్న వైవిధ్యతలు భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి ఆలంబనగా నిలుస్తున్నాయి.

## ముఖ్యాంశాలు

- మద్రాసు రాష్ట్రంతో కలిసి ఉన్న తెలుగు ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్రం కోరుతూ పొట్టి శ్రీరాములు 1952, అక్టోబర్ 19న నిరాహార దీక్షకు పూనుకున్నారు. 58 రోజుల దీక్ష తర్వాత 1952, డిసెంబర్ 15న ఆయన చనిపోయారు.
- కేంద్ర ప్రభుత్వం 1953, ఆగస్టులో ఫజల్ అలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిటీ (SRC)ని నియమించింది. ఇందులో కె.ఎం.పణిక్కర్, హృదయనాథ్ కుంజ్రులు సభ్యులుగా ఉన్నారు. వారి నివేదిక ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం - 1956 అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం దేశంలో 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఆ విధంగా ఏర్పడిందే ఆంధ్రప్రదేశ్. ప్రస్తుతం మన దేశంలో 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలున్నాయి.
- భారతదేశ తొలి ప్రధాని, అలీనోద్యమ రూపశిల్పి అయిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రపంచంలో రెండు అగ్రరాజ్యాల (US-SR, USA) కూటముల్లో చేరకుండా రెండింటికి సమాన దూరం పాటిస్తూ భారత విదేశాంగ విధానాన్ని రూపొందించారు. సుకర్నో (ఇండోనేషియా), నాజర్ (ఈజిప్టు), మార్షల్ టిటో (యుగోస్లేవియా) లతో కలిసి అలీనోద్యమాన్ని ముందుకు నడిపారు.
- అధికార భాష చట్టం-1963 ప్రకారం హిందీ తమపై బలవంతంగా రుద్దుతున్నారని భావించిన తమిళనాడు ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా హిందీ భాషా వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టారు.
- 1967లో కాంగ్రెస్ పార్టీ పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, కేరళ శాసనసభ ఎన్నికల్లో పరాజయం పాలైంది. బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల్లో కూడా చాలా తక్కువ సీట్లు గెలుచుకుంది.
- 1972లో ఖాసి, జైంతియా, గారో గిరిజన ప్రాంతాలతో కూడిన 'మేఘాలయ' కొత్త రాష్ట్రంగా ఏర్పడింది.
- రాజ్యాంగంలోని 370 అధికరణం జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తుంది.
- 1973లో తీవ్ర ఆర్థిక సంక్షోభంతో ప్రజల్లో అశాంతి పెరిగింది. జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ప్రతిపక్షాలు ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాయి.
- ఇందిరాగాంధీ లోక్‌సభ (1975) సభ్యత్వాన్ని అలహాబాద్ హైకోర్ట్ రద్దు చేసింది. ఈ పరిణామాలను ఎదుర్కోవడానికి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ సలహా మేరకు రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్.. 1975, జూన్ 25న జాతీయ అత్యవసర పరిస్థితిని విధించారు.

## కీలక పదాలు- నిర్వచనాలు

**1. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ:** దేశంలో వివిధ రాష్ట్రాలుంటాయి. పాలనా సౌలభ్యం, వికేంద్రీకరణ కోసం భౌగోళికంగా కొంత ప్రాంతాన్ని నిర్ణయించి రాష్ట్రాలుగా ఏర్పరుస్తారు. రాష్ట్రాలను ఏర్పాటు చేసేటప్పుడు రాజ్యాంగ సూత్రాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. అయితే కొన్నిసార్లు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలవారు తమ ప్రత్యేక ఉనికిని చాటుకోవడానికి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తారు. పార్లమెంట్ ఆ డిమాండ్ న్యాయమైందని భావిస్తే రాజ్యాంగ పరిధిలో ఆ రాష్ట్రాన్ని విభజించి లేదా పక్క రాష్ట్రాల్లోని కొంత ప్రాంతాన్ని కలిపి నూతన రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడాన్ని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అంటారు. **ఉదా:** 1953లో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిటీని నియమించి దాని సూచనల మేరకు 1956 చట్టాన్ని రూపొందించారు. దాని ప్రకారం భాషా ప్రాతిపదికన కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

**2. ఏక పార్టీ ఆధిపత్యం:** కేంద్రంలో, రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అధికంగా సీట్లను పొందిన ఒకే పార్టీ ఎక్కువకాలం అధికారంలో ఉండటాన్ని ఏక పార్టీ ఆధిపత్యం అంటారు.

**3. అత్యవసర పరిస్థితి:** దేశ సమగ్రతకు, ప్రజాస్వామ్యానికి, శాంతిభద్రతలకు ప్రమాదం ఏర్పడి సామాజిక, ఆర్థిక మార్పులకు వీలులేని పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు దేశపాలన నిర్వహణ అల్లకల్లోలమవుతుంది. ఆ స్థితి నుంచి దేశాన్ని, ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించి రాజ్యాంగం ప్రకారం నిర్బంధాలను అమలు చేస్తుంది. పరిస్థితులు కుదుటపడిన తర్వాత వాటిని తొలగిస్తుంది. భారత రాజ్యాంగం ప్రకారం మన దేశంలో మూడు రకాల అత్యవసర పరిస్థితులను విధించొచ్చు.

**4. ప్రాంతీయ ఉద్యమాలు:** దేశంలో ఏదైనా ఒక ప్రాంత ప్రజలు తమ భాష, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, భౌగోళిక, ఆర్థికాంశాలను పరిరక్షించుకోవడంలో భాగంగా తమకు ప్రత్యేక ప్రతిపత్తిని కోరుకుంటారు. తమ కోరికలను ప్రభుత్వం పట్టించుకోనప్పుడు ఉద్యమిస్తారు. వాటినే ప్రాంతీయ ఉద్యమాలంటారు.

## పదో తరగతి

### సాంఘిక శాస్త్రం

## 4 మార్కుల ప్రశ్న

1. **ఎన్నికల్లో ప్రత్యేకించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని నిరక్షరాస్యత ఎలా ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యను ఎలా పరిష్కరించవచ్చు? (సమకాలీన అంశాలపై ప్రతిస్పందన)**

జ. **ఓటుహక్కు వినియోగంలో ప్రజల నిరక్షరాస్యత ప్రభావం:**

- ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పాలకులను ఎన్నుకోవడంలో ఓటుహక్కు ఆయుధం వంటిది. దీనితో తమకు నచ్చినవారిని గెలిపించవచ్చు. నచ్చనివారిని ఓడించొచ్చు.
- ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, తమ అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను ఓట్లు అడుగుతాయి. రాజకీయ పార్టీలు తమ ఆశయాలు, లక్ష్యాలు తెలుపుతూ మ్యానిఫెస్టోను విడుదల చేస్తాయి. దీన్ని అర్థం చేసుకోవడానికి, అభ్యర్థుల గుణగణాలను పరిశీలించడానికి, తమకు నీతివంతమైన పాలన అందించే పాలకులను నిర్ణయించుకోవడానికి ఓటర్లకు అక్షరాస్యత అవసరం. నిరక్షరాస్యుల్లో రాజకీయ చైతన్యం తక్కువగా ఉంటుంది.
- ఇప్పటికే బ్యాలెట్ పత్రాలపై జరిగే ఎన్నికల్లో చాలా ఓట్లు చెల్లనివిగా తేలుతున్నాయి. దీనికి ప్రధాన కారణం నిరక్షరాస్యులైన ఓటర్లకు ఓటింగ్ ప్రక్రియ, బ్యాలెట్ పత్రాలపై గుర్తులను గుర్తించడంలో ఉన్న అవగాహనా రాహిత్యం.
- దేశంలో చాలాచోట్ల నిరక్షరాస్యులైన ఓటర్లను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ ప్రలోభాలకు గురి చేసి ఎన్నికల్లో గెలుస్తున్నారు.

**ఈ సమస్యలను పరిష్కరించడానికి సూచనలు:**

- ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ఓటర్లందరూ అక్షరాస్యులయ్యేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ప్రజల్లో రాజకీయ, సామాజిక చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు కృషి చేయాలి.
- ఓటింగ్ ప్రక్రియలను అతి సామాన్యుడైన వ్యక్తి కూడా అవగాహన చేసుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలి.
- విద్యావంతులు, సామాజిక సంస్కరణ ఉద్యమ సంస్థలు ప్రజలందరికీ ఓటు హక్కు విలువను తెలియచేసి దాన్ని సరైన విధంగా వినియోగించుకొనేటట్లు అవగాహన శిబిరాలు నిర్వహించాలి.

## 2 మార్కుల ప్రశ్నలు

1. **భారతదేశంలో ఇటీవల ఏర్పడిన కొత్త రాష్ట్రాలు ఏవి? అవి ఎప్పుడు ఏర్పడ్డాయి? (సమాచార సేకరణ నైపుణ్యాలు)**

జ.

| రాష్ట్రం | ఏర్పడిన తేదీ |
|---|---|
| ఛత్తీస్‌గఢ్ | నవంబర్ 1, 2000 |
| ఉత్తరాఖండ్ | నవంబర్ 9, 2000 |
| జార్ఖండ్ | నవంబర్ 15, 2000 |
| తెలంగాణ (29వ రాష్ట్రం) | జూన్ 2, 2014 |

2. **42వ రాజ్యాంగ సవరణ ఉద్దేశాలను తెలపండి? (విషయావగాహన)**

జ. జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో 1976లో మన రాజ్యాంగానికి 42వ సవరణ చేశారు. దీని ద్వారా రాజ్యాంగంలో ముఖ్యమైన మార్పులు జరిగాయి. ఇవి దేశ ప్రజాస్వామ్య స్వభావాన్ని కొంత బలహీనపర్చాయి.

**42వ సవరణ ఉద్దేశాలు:**

- ఎన్నికల వివాదాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా చేయడం.
- రాష్ట్ర ప్రభుత్వాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని అధికంగా బలపర్చడం.
- సామాజిక, ఆర్థిక మార్పులకు ఉద్దేశించిన చట్టాలకు న్యాయస్థానాల నుంచి రక్షణ కల్పించడం.
- న్యాయ వ్యవస్థ పార్లమెంటుకు లోబడి ఉండేలా చేయడం.

## 1 మార్కు ప్రశ్నలు

1. **జాతీయీకరణ అంటే ఏమిటి? (విషయావగాహన)**

జ. పాలనలో సామ్యవాద స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో సామాజిక, ఆర్థిక మార్పులను సాధించే లక్ష్యంతో ప్రభుత్వం.. ప్రైవేటు సంస్థలను తన ఆధీనంలోకి తీసుకోవడాన్ని జాతీయీకరణ అంటారు.

2. **భారతదేశంలో ఒకే జాతీయ భాష ఉండాల్సిన అవసరం ఉందా? (ప్రశంస/ అభినందన - సున్నితత్వం)**

- వివిధ భాషలకు, సంస్కృతులకు, ప్రాంతాలకు నిలయమైన భారతదేశంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒకే జాతీయ భాష ఉండటం ఆవశ్యకం. జాతీయ భాష ప్రజలందరినీ ఏకతాటిపై నడిపిస్తుంది. తామందరూ ఒకే జాతివారమనే విశ్వాసాన్ని ప్రజలందరిలో పెంపొందిస్తుంది.

3. **భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడి ఉండకపోతే దేశ ఐక్యతకు మరింత మేలు జరిగి ఉండేదా? (సమకాలీన అంశాలపై ప్రతిస్పందన)**

జ. లేదు. నష్టం జరిగి ఉండేదని చెప్పొచ్చు. ఎందుకంటే అనేక భాషలకు నిలయమైన విశాల భారతదేశంలో పెద్ద పెద్ద రాష్ట్రాలు ఉండడం వల్ల పాలనాధికారం అందరికీ దక్కక అసంతృప్తి ప్రబలి దేశ విశాల సమగ్రతకు ముప్పు వాటిల్లేది. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం వల్ల ఆ ముప్పు తొలగింది.

## లక్ష్యాత్మక ప్రశ్నలు - ½ మార్కు

1. **స్విట్జర్లాండ్‌లో మహిళలకు ఏ సంవత్సరంలో ఓటుహక్కు కల్పించారు?**
   ఎ) 1950 బి) 1952
   సి) 1964 డి) 1971
2. **బంగ్లాదేశ్ కారణంగా భారత్ - పాకిస్థాన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?**
   ఎ) 1948 బి) 1965
   సి) 1971 డి) 1990
3. **నెహ్రూ చనిపోయిన తర్వాత (1964) భారత ప్రధానమంత్రి అయినవారు?**
   ఎ) ఇందిరాగాంధీ
   బి) లాల్ బహదూర్ శాస్త్రి
   సి) మొరార్జీదేశాయ్
   డి) నీలం సంజీవరెడ్డి
4. **తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని నడిపిన రాజకీయ పార్టీ?**
   ఎ) డీఎంకే బి) అన్నా డీఎంకే
   సి) కాంగ్రెస్ డి) ఎ.డి.ఎం.కె
5. **పంచశీల ఒప్పంద రూపశిల్పి?**
   ఎ) నెహ్రూ బి) గాంధీ
   సి) అంబేద్కర్ డి) ఇందిరాగాంధీ
6. **జమ్మూకశ్మీర్ స్వదేశీ సంస్థాన రాజు?**
   ఎ) షేక్ మహ్మద్ అబ్దుల్లా
   బి) షేక్ ముజీబీర్ రహమాన్
   సి) హరిసింగ్
   డి) రాజా ఠాకూర్ సింగ్
7. రాజకీయ సమానత్వాన్ని ____ సూత్రంతో సాధించవచ్చు.
8. వయోజన ఓటుహక్కు అంటే ______ సంవత్సరాల వయసు నిండినవారికి ఓటు హక్కు కల్పించడం.
9. విభిన్న సిద్ధాంతాలు ఉన్నవాళ్లను ఆకర్షించడం వల్ల ______ పార్టీ ఆధిపత్యం ఎక్కువకాలం కొనసాగింది.
10. అత్యవసర పరిస్థితి ఫలితంగా ప్రజలు ______ లకు పరిమితులు విధించారు.
11. గరీబీ హటావో నినాదాన్నిచ్చినవారు____
12. ________ విప్లవం వల్ల ఆహార ఉత్పత్తి పెరిగింది.

## సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) ఎ;
5) ఎ; 6) సి;
7) ఒక వ్యక్తి - ఒక ఓటు;
8) 18; 9) కాంగ్రెస్; 10) హక్కు;
11) ఇందిరాగాంధీ; 12) హరిత.